కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. పగలు తీవ్రంగా ఎండ కాస్తోంది. రాత్రి మంచు కురుస్తోంది. ఈ క్రమంలో పలు రోగాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజలు జ్వరాలతో పాటు విరోచనాలు, కీళ్ల నొప్పులతో బాధపడుతూ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. దీంతో పీహెచ్‌సీలు కిటకిట లాడుతున్నాయి. వారికి సెలైన్లు పెట్టిందుకు బెడ్లు చాలకపోవడంతో తిప్పలు తప్పడం లేదు.

- వాతావరణంలో మార్పులతో ప్రబలుతున్న రోగాలు
- బెడ్లు చాలక ఇబ్బంది పడుతున్న రోగులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



జ్వర పీడితులతో నిండిపోయిన డీవీ సత్రం పీహెచ్‌సీ

దొరవారిసత్రం : మండలంలోని దొరవారిసత్రం, తొగరాముడి పీహెచ్‌సీల్లో అరకొర వసతులు ఉన్నాయి. ప్రధానంగా సరిపడా బెడ్లు, నాణ్యమైన మందులు లేవు. సెలైన్లు పెట్టడానికి బెడ్ల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. తొగరాముడి పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది స్థానికంగా ఉండకపోవడంతో పలు గ్రామాల ప్రజలు వైద్యం కోసం పట్టణ ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. నేలపట్టు, ఏకొల్లు, మైలాంగం, నెల్లూరుపల్లి, మీజూరు, కారికాడు, నేలపట్టు, కట్టువాపల్లి, కల్లూరు తదితర గ్రామాల్లో జ్వరాలు ప్రబలాయి. ఎండల తీవ్రత పెరగడంతో ఎక్కువ మంది విరోచనాలతో బాధపడుతున్నారు. రోజూ సుమారు 100 మంది వరకు ఆస్పత్రులకు వస్తున్నారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది నామ మాత్రంగానే వైద్య సేవలు అందిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బెడ్లు సరిపోవడం లేదు



దొరవారిసత్రం పీహెచ్‌సీలో రోగులకు సరిపడా బెడ్లు లేవు. నేను విరేచనాలతో బాధపడుతున్నాను. సెలైన్ పెట్టుకునేందుకు బెడ్డు కోసం పడిగాపులు తప్పడంలేదు. మందులు కూడా లేవు. దీంతో ఎక్కువ మంది పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళుతున్నారు.

- మస్తాన్, పాలెంపాడు గ్రామం

అత్యవసర సమయంలో ఎవరూ ఉండరు



తొగరాముడి పీహెచ్‌సీలో వైద్యులు, వైద్య సిబ్బంది సక్రమంగా విధులకు రావడం లేదు. అత్యవసర సమయంలో అందుబాటులో ఉండడం లేదు. సాయంత్రం నాలుగు గంటలకు ఆస్పత్రిని మూసేస్తున్నారు. సెలవు దినాల్లో పీహెచ్‌సీ పూర్తిగా మూత బడి ఉంటుంది.

- మంజులమ్మ, మీజూరు గ్రామం

అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి



డీవీ సత్రం పీహెచ్‌లో రోగులకు అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉంచాము. నిధులు ఉన్నా లేకపోయినా సొంత నిధులతో అత్యసర మందులు కొనుగోలు చేస్తున్నాం. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు.

- డాక్టర్ చైతన్య, వైద్యాధికారి, డీవీ సత్రం పీహెచ్‌సీ

క్లుప్తంగా

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దండి

సైదాపురం: క్రమం తప్పకుండా చెత్తను సేకరించి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఆయన సోమవారం ఊటుకూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పలు వీధులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. చెత్తను వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని ప్రజలకు సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటారని పేర్కొన్నారు.

విద్యార్థులను తరలించొద్దు



మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కోట: ఉత్తమనెల్లూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులను మరో పాఠశాలకు తరలించడాన్ని అడ్డుకుంటామని ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. వారు సోమవారం ఎంపీడీవో గోపి, తహసీల్దార్ జయజయరావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉత్తమనెల్లూరులో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను గమళ్లపాళెంలో ఉన్న ఎంపీయూ పీ స్కూల్‌లో విలీనం చేయనున్నట్టు ఉపాధ్యాయుల ద్వారా తెలిసిందన్నారు. తమ పిల్లలను స్థానిక పాఠశాలలోనే చదివించుకుంటామని, మరో పాఠశాలకు పంపమన్నారు. మరో పాఠశాలకు తరలించాలని చూస్తే పిల్లలను బడి మాన్పించి మాతో పాటు పనికి సుకువెళతామన్నారు.

హౌసింగ్‌లో జరిగిన అవినీతిపై ఫిర్యాదు



జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆరి శంకరయ్య

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలో హౌసింగ్‌లో జరుగుతున్న అక్రమాలపై తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్‌కు సోమవారం ఫిర్యాదు చేసినట్టు వెంకటగిరి 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వెంకటగిరిలో ఏర్పాటుచేసిన జగనన్న లేఅవుట్‌లో సుమారు 211 ప్లాట్ల వివరాలు హౌసింగ్ అధికారులు తెలియజేయడం లేదన్నారు. బెస్తపాళెంలో 150 ఇళ్లకు పైగా సిమెంట్, ఇసుక, కమ్మీ బిల్లులు స్వాహా చేశారని తెలిపారు. దీనిపై విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు పేర్కొన్నారు.

పోలీస్ లాంఛనాలతో కానిస్టేబుల్‌కు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

చిట్టమూరు/నాయుడుపేట టౌన్: ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ నాయుడుపేటలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భాస్కర్ మృతదేహానికి సోమవారం పోలీస్ లాంఛనాలతో అంత్య క్రియలు నిర్వహించారు. మండలంలోని ఈశ్వరవాక గ్రామానికి చెందిన భాస్కర్(37) ఆదివారం తల్లిదండ్రులను చూసి నాయుడుపేటకు బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఈశ్వరవాకకు తరలించి అంత్యక్రియలు చేపట్టారు. కార్యక్రమానికి గూడూరు, నాయుడుపేట డీఎస్పీలు గీతాకుమారి, చెంచుబాబు, నాయుడుపేట, వాకాడు సీఐలు బాబీ, హుస్సేన్‌బాషా, ఎస్ఐ చినబలరామయ్య హాజరయ్యారు.

మౌలిక వసతులు కల్పించాలి

దొరవారిసత్రం : రోగులకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య తెలిపారు. పీహెచ్‌సీలో సోమవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. పడకలు తక్కువగా ఉండడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి తెలిపారు. వేసవి సమీస్తుడడంతో పలు గ్రామాల్లోని ప్రజలు జ్వరాలు, విరోచనాలతో ఇబ్బందులు పడుతున్నా రని పేర్కొన్నారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందిపడకుండా ఎప్పటికప్పుడు జ్వరపీడిత గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన, సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో సమస్యల వెల్లువ

దొరవారిసత్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సమస్యలు వెల్లువెత్తాయి. భూ సమస్యలు పరిష్కరించాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పలువురు కోరారు. తహసీల్దార్ శైలకుమారి మాట్లాడుతూ పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏవో రఘురామయ్య, హౌసింగ్ ఏఈ మోహన్ రావు, ఇరిగేషన్ జేఈలు హరికృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ శిల ప్రతిష్ట



నాయుడుపేట టౌన్ : మండలంలోని కూచివాడ దళితవాడ సమీపంలో సోమవారం పోలేరమ్మ శిల ప్రతిష్ఠను వేదపండితులు ఘనంగా చేపట్టారు. రెండు రోజులుగా ప్రత్యేక పూజలు చేశారు. 41వ రోజు కుంభాభిషేకాన్ని ఘనంగా చేపట్టనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆటలు, పాటలతో విద్యను బోధించాలి



వెంకటగిరి రూరల్ : అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలకు ఆటలు, పాటలతో విద్యను బోధించాలని ఎంఈవో కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన సోమవారం వెంకటగిరిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఆట పాటలతో చదువుపై ఆసక్తి కలిగించాలన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి సీడీపీవో శంషాద్‌బేగం, సీఆర్పీలు కొండూరు రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన భూమి ఆక్రమణ



పుచ్చ సాగుకు సిద్ధం చేస్తున్న శ్మశాన భూమి

చిల్లకూరు : మండలంలోని మోమిడి గ్రామం సర్వే నంబర్ 300లో ఉన్న 19.90 ఎకరాల శ్మశాన భూమిని స్థానిక కూటమి నేత ఆక్రమించుకున్నాడు. దాన్ని చదును చేసి పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ భూమి అనేక ఏళ్ల క్రితం శ్మశానికి చెందినదిగా రికార్డుల్లో నమోదు చేశారు. కాలక్రమంలో కొంత మంది ఆ భూమిలో రోడ్డు పక్కకు వచ్చే విధంగా కొట్లు కట్టుకున్నారు. కొంత మంది చివరగా ఉండే వారు పక్కా భవనాలు నిర్మించుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో శ్మశానానికి ఐదు ఎకరాలు కేటాయించి మిగిలిన భూమిలో జగనన్న కాలనీ ఏర్పాటు చేస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. ఆ సమయంలో టీడీపీ నేతలు దాన్ని అడ్డుకున్నారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో శ్మశాన భూమిపై కన్నేశారు. యంత్రాలతో సాగుకు అనుకూలంగా చదును చేశారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ శ్రీనివాసులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీఆర్వోలు, వీఆర్ఏలు అక్కడ ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేసేందుకు వెళ్లగా కూటమి నేతలు అడ్డుకుని వెనక్కి పంపేశారు. తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో పుచ్చపంట సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు స్పందించి శ్మశాన భూమి ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులు బాధ్యతతో పని చేయాలి

పెళ్లకూరు: ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేసి పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎంఈవో శంకరయ్య తెలిపారు. ఆయన సోమవారం కొత్తూరు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచాలన్నారు. మొక్కలు నాటి సంరక్షించేలా పిల్లలను చైతన్యం చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ఉపాధ్యాయుడు భానుమూర్తి పాల్గొన్నారు.

ఆక్రమణలన్నీ తొలగించాల్సిందే

రాపూరు : కండలేరు జలాశయం భూమిని ఆక్రమించుకుని చాలామంది ఆక్రమించుకున్నారని, అందరివీ స్వాధీనం చేసుకోవాలని స్థానికులు రాంబాబు, శేషుబాబు, వెంకటాద్రి కోరారు. కండలేరు జలాశయానికి సంబంధించి 200 ఎకరాల భూమి ఉంది. దాన్ని పలువురు ఆక్రమించుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తి తోటకు వెళ్లేందుకు దారి కోసం ఆక్రమణలను తొలగించాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నాడన్నారు. అధికారులు కొందరికి మాత్రమే నోటీసులు ఇచ్చి భూమిని స్వాధీనం చేయాలని ఆదేశించారని తెలిపారు. భూమిని ఆక్రమించుకున్న అందరికీ నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని, కొందరిని మాత్రమే చేయించాలని చూస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. దీనిపై తహసీల్దార్ లక్ష్మీ నరసింహం మాట్లాడుతూ ఆ ప్రాంత ప్రజల ఫిర్యాదు మేరకు ఆక్రమణలో ఉన్న అన్ని భూములను ఖాళీ చేయిస్తున్నట్టు తెలిపారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయాలు





తూర్పుకనుపూరులో ముస్తాబవుతున్న మల్లికార్జున స్వామి ఆలయం, దర్శనమిస్తున్న స్పటిక లింగం

చిల్లకూరు : మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని పలు శివాలయాలు ముస్తాబవుతున్నాయి. మండలంలోని చేడిమాలలోని నాగలింగేశ్వరస్వామి, తూర్పుకనుపూరులోని కామాక్షి సమేత మల్లికార్జున స్వామి, లింగవరంలోని వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయాల్లో వేడుకలను నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తూర్పుకనుపూరులోని ఆలయంలోని స్పటిక లింగాన్ని శివరాత్రి రోజు దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. దీంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. శివరాత్రి సందర్భంగా బుధవారం సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణంతోపాటు గ్రామంలో స్వామి వారి ఊరేగింపు ఉంటుంది. అలాగే చేడిమాలలో వెలసిన నాగలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలకు రంగం రంగ వైభవంగా చేపట్టేందుకు నిర్వాహకులు రాజనేని పిచ్చయ్య నాయుడు, రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు.

హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి చేయూత



నగదు అందజేస్తున్న శేషం మునిగోపి సోదరులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని స్వర్ణముఖి నది తీరం వద్ద ఉన్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి దాతలు చేయూత ఇస్తున్నట్లు హిందూ ధర్మ సేవా సంఘం నాయకులు పీడీ ఉదయశంకర్, దువ్వూరు సుబ్రహ్మణ్యం రెడ్డి తెలిపారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ శేషం మునిగోపి, ఆయన సోదరుడు మునిమోహన్ తమ తల్లిదండ్రులు శేషం కృష్ణమూర్తి, మస్తానమ్మ జ్ఞాపకార్థం రూ.2 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. ఈ నగదుతో శ్మశానవాటిక వద్ద వంటశాల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. యాదపల్లి జనార్దన్ యాదవ్, దాసరి ప్రభాకర్ నాయుడు, పసుపులేటి రాజా నాయుడు, మహేష్, దాము, కంకిపాటి పాండు రంగారావు, ఎస్ కుమార్ పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలకు పటిష్ట భద్రత

చిట్టమూరు: మహా శివరాత్రి వేడుకలకు పటిష్ట భద్రత కల్పిస్తున్నట్టు గూడూరు డీఎస్పీ గీతా కుమారి తెలిపారు. మండలంలోని యాకసిరి పాటిమిట్ట గ్రామంలో వెలసిన కామాక్షి సమేత నగరేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా రెండు రోజులు వివిధ కార్యక్రమాలు చేపడతారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. వారికి ఇబ్బందులు లేకుండా ఈవో రవిక్రిష్ణ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో గూడూరు డీఎస్పీ గీతాకుమారి సోమ వారం ఆలయాన్ని సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. బందోబస్తు ఏర్పాటుచేయాలని ఎస్ఐ చినబలరామయ్యను ఆదేశించారు. హెడ్ కానిస్టేబుల్ సగటూరు ప్రసాద్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



దక్కిలి: ఎస్ఐ శివశంకర్ సోమవారం కందలవారిపల్లి సమీపంలోని వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిలో వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయం విరమించుకోవాలి



పోస్టు కార్డులతో నిరసన తెలుపుతున్న కార్మికులు

వెంకటగిరి రూరల్ : ఆప్కాస్‌ను రద్దు చేసి కాంట్రాక్టర్ల వ్యవస్థను తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం తగదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు తెలిపారు. వారు సోమవారం కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్, కాశీపేట మీదుగా తపాలా కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అక్కడ తమ డిమాండ్లను పోస్టుకార్డుల ద్వారా ప్రభుత్వానికి పోస్టు చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఆప్కాస్‌లో కలిసి ప్రతినెలా క్రమంతప్పకుండా జీతాలు ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు ఆ వ్యవస్థను రద్దు చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. మళ్లీ కార్మికులకు ఇబ్బందులు తప్పవన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ పట్టణ కార్యదర్శి ఎన్ ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి వి పెంచలయ్య, పట్టణ ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం, రమణయ్య, హరిబాబు, ఇందిరమ్మ, రత్నమ్మ, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాండురంగడి ఆలయంలో చోరీ

సైదాపురం: సైదాపురం పంచాయతీ పరిధిలోని దాడిశెట్టిపల్లి గ్రామంలో ఉన్న పాడురంగ స్వామి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి అమ్మవారి మంగళసూత్రంలో పాటు హూండీని ఎత్తుకెళ్లారు. ఈ మేరకు గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయంలో సుమారు రూ.20వేల విలువ చేసే మంగళ సూత్రంతో పాటు నగదు అపహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సాగు భూములు ఇప్పించాలని నిరసన



నిరసన తెలుపుతున్న అలిమిలి గ్రామస్తులు

బాలాయపల్లి(సైదాపురం): సాగు భూములు ఇప్పించి జీవనాధారం కల్పించాలని మండలంలోని అలిమిలి పంచాయతీ వెంకటరెడ్డిపల్లి అరుంధతీయ వాడ వాసులు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తమకు ఎలాంటి జీవనాధారం లేదన్నారు. కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అలిమిలి గ్రామం సర్వే నంబర్ 4లో ఉన్న ప్రభుత్వ భూమిలో చెట్టుపుట్టలను తొలగించుకుని సాగుకు సిద్ధంచేసుకున్నామని తెలిపారు. అధికారులు అందులోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. ప్రస్తుతం ఆ భూమిని కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణలను తొలగించి తమకు కేటాయించాలని కోరారు.

అబాకస్‌లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని జాన్విని అభినందిస్తున్న అబాకస్ నిర్వాహకులు

నాయుడుపేట టౌన్ : శ్రీకాళహస్తి రోటరీ క్లబ్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో నాయుడుపేటకు చెందిన విద్యార్థిని మామిడి జాన్వి ప్రతిభ చూపింది. ఈ పోటీల్లో 180 మంది పైగా విద్యార్థులు పాల్గొన్నారు. గణిత శాస్త్ర విభాగం జూనియర్ లెవల్–2లో జాన్వి రాష్ట్ర స్థాయి లో మొదటి స్థానంలో నిలిచింది. ఆమె నాయుడుపేటలోని సెయింట్ మేరీస్ స్కూల్‌లో 2వ తరగతి చదువుతోంది. ఆమెను ప్రిన్సిపాల్ సిస్టర్ రజులిన్, నిర్వాహకులు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు.

వాజ్‌పేయి సేవలు మరువలేనివి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న సామంచి శ్రీనివాస్

గూడూరు రూరల్ : అణుపరీక్షలు నిర్వహించి భారతదేశ శక్తిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ అని తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తెలిపారు. గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాల విద్యార్థులకు సోమవారం భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని వాజ్‌పేయి పేరు మీద ప్రతిభా పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని వివరించారు. యువత వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమరత సేవా ఫౌండేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోట సునీల్‌కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సోమశేఖర్, జిల్లా కార్యదర్శి తేజ భరత్, నగర అధ్యక్షుడు శివశంకర్, బీజేపీ జిల్లా కార్యదర్శి బిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దారికి అడ్డంగా నిర్మించిన గోడను తొలగించాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేంద్ర, సర్వేయర్

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని భూపయ్య కాలనీలో కూటమి నేతలు దారికి అడ్డంగా నిర్మించిన గోడను తొలగించాలని స్థానికులు కోరారు. వారు సోమవారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఆ దారి నుంచి ఎన్నో ఏళ్లుగా రాకపోకలు సాగిస్తున్నామని తెలిపారు. కూటమి నేతలు తమ పట్టా భూమి అని పేర్కొంటూ దారికి అడ్డంగా గోడ నిర్మించడం తగదన్నారు. ఈ విషయాన్ని అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రీవెన్స్‌డే ఫిర్యాదు స్వీకరించిన తహసీల్దార్ మాగర్ల రాజేంద్ర, సర్వేయర్ చరణ్‌తో కలిసి సోమవారం సాయంత్రం భూపయ్య కాలనీ వద్దకు వెళ్లి గోడను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, మైలాపూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

గూడూరు రూరల్ : ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక ఆదాయంతోపాటు లాభా లు కలుగుతాయని గూడూరు ఏడీఏ గోపీనాయక్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ప్రభు త్వ కార్యాలయాల వద్ద సోమవారం ఏపీ సీఎస్ఎఫ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకు కూరలను విక్రయించారు. ప్రకృతి వ్యవసాయం, విత్తన శుద్ధి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో రమేష్, డివిజన్ ఎస్ఎఫ్ఎంటీ తిరుమల, ఎల్‌ట్రీలు శ్రీను, ల క్ష్మీ, పూర్ణిమ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

వాకాడు : మండలంలోని బాలిరెడ్డిపాళెంలో ఉన్న పేద విద్యార్థులకు సోమవారం కోట గ్రామానికి చెందిన శ్రీ షిరిడీ సాయి అక్షయ సేవా సమితి దాతృత్వంతో అమ్మా ఫౌండేషన్ ప్రతినిధులు దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకురాలు స్వప్న మాట్లాడుతూ పేద విద్యార్థులను దత్తతకు తీసుకుని అమ్మా ఫౌండేషన్ ద్వారా నెల నెలా సరుకులు అందజేస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్యం కోసం వైద్య ఖర్చులు భరిస్తున్నామని వెల్లడించారు. ఈ క్రమంలోనే శ్రీ షిరిడీ సాయి అక్షయ సేవా సమితి వారు ముందుకొచ్చి దుస్తులు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీ షిరిడీ సాయి అక్షయ సేవా సమితి ప్రతినిధి అల్లం రమణయ్య, సాయి, రాయిపు నరసింహులు పాల్గొన్నారు.

ఐటీడీఏను ఏర్పాటు చేయాలని వినతి



ఐటీడీఏ గురించి జేసీకి విన్నవిస్తున్న గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు

వెంకటగిరి(సైదాపురం) : తిరుపతి జిల్లా కేంద్రంగా ఎస్టీ వర్గీకరణ ఐటీడీఏ ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల మల్లికార్జున్ కోరారు. ఆయన సోమవారం తిరుపతిలో జేసీ శుభమ్‌బన్సల్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన తెగల్లో అత్యధిక జనాభా కలిగిన యానాదులు 10 లక్షల మందికి పైగా రాష్ట్రంలో ఉన్నారని తెలిపారు. వారు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్టీ వర్గీకరణ చేసి గిరిజనుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అత్తూరు చంగల్రాయలు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపాటి వెంకటరమణ, మహిళా నాయకులు రేవతి తదితరులు పాల్గొన్నారు.